క్లుప్తంగా

విద్యా సమస్యలపై చర్చించాలి



ప్రచార బ్రోచర్‌ను విడుదల చేసిన నాయకులు

నరసాపురం: ప్రజా సమస్యలు, ముఖ్యంగా విద్యా వ్యవస్థలోని సమస్యలపై చట్టసభల్లో పెద్ద ఎత్తున చర్చలు జరగాలని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న దళితనేత జీవీ సుందర్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో పలు విద్యాసంస్థలను సందర్శించారు. అనంతరం స్థానిక మొగల్తూరు రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. శాసనమండలిలో ఇటీవల ప్రజా సమస్యలపై పెద్దగా చర్చలు జరగడంలేదన్నారు. రాజకీయ కుటుంబానికి చెందిన తాను కొత్త వరవడిలో వెళ్లాలని ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో దళితసంఘాల నాయకులు కాకిలేటి ఆనంద్‌కుమార్, సోడదాసి శ్రీధర్, కాటం చంటి, నేతల రమేష్, దిడ్ల ప్రసన్నకుమార్, దాసిరి రాజు, గుంపుల రత్నరాజు, పొలమూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీ సర్వేకి సహకరించండి

పాలకొల్లు అర్బన్: రీ సర్వే సమయంలో ప్రతి రైతు తమ పొలానికి సంబంధించి దస్తావేజులతో ఆయా సర్వే నెంబర్ల వద్ద సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ కోరారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో ఈ నెల 20 నుంచి నిర్వహించే రీ సర్వేపై రైతులకు అవగాహన సభ నిర్వహించారు. సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, మండల పరిషత్ ప్రతిపక్ష నేత శాగ సత్యనారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ కుల గణన తప్పుల తడక



డీటీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెనుగొండ: రాష్ట్రంలో ఎస్సీ కులం మార్చే కుట్ర జరుగుతుందని, ఎస్సీ కుల గణన తప్పుల తడకగా మారిందంటూ ఎస్సీ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆచంట తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డెప్యూటీ తహసీల్దారు ఎం సోమేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కుల గణన పేరుతో ఆర్యన్ మాల, ఆర్యన్ మాల క్రిష్టియన్, ఆది ఆంధ్ర, ఆది ఆంధ్ర క్రిష్టియన్, ఎస్సీ మాల క్రిష్టియన్‌గా తప్పుడు సమాచారాన్ని ముద్రిస్తున్నారని పేర్కొన్నారు. గత 30 ఏళ్ల నుంచి ఎస్సీ మాల కులానికి చెందిన శాశ్వత సర్టిఫికేట్లు ఉన్నాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన కుల గణన ఆచంట పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించిన జాబితా సమగ్ర సర్వే చేయించి తప్పులు సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నేతలు కోట వెంకటేశ్వరరావు, బీరా మధు, ఉల్లం రామాంజనేయులు, మట్టా చంటి, తప్పెట్ల వెంకట్రావు, మాక ఠాగూర్, నాగిపల్లి శ్రీనివాస్, దేవబత్తుల రామకృష్ణ, కప్పల రాజేంద్ర, డబ్బా ప్రకాష్ పారుపల్లి సుందర్‌పాల్, ఇజ్రాయిల్, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలపక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

తణుకు అర్బన్: పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు భవిష్యత్తులో ప్రజలపక్షాన నిర్వహించే పలు నిరసనల్లో పాల్గొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్దపు హామీలతో వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న భారాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు కోట స్వామీజీ, భూపతిరాజు సూర్యనారాయణరాజు, సరెళ్ల వీరతాత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఇరగవరం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇరగవరం మండలం పేకేరు గ్రామంలో కార్యకర్తల సమావేశంలో కారుమూరి మాట్లాడారు. చంద్రబాబు ప్రజలను మోసం చేసి పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని తెలిపారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

పశువులను తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

భీమవరం: వ్యానులో తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్టు చేశామని వన్‌టౌన్ ఎస్సై బి.వై. కిరణ్‌కుమార్ తెలిపారు. 3 గోవులు, 6 ఎద్దులు, ఒక పెయ్యి దూడను అక్రమంగా తీసుకువెళ్తున్న గొలగాని ఆదినారాయణ, అల్లు కిషోర్‌లను అరెస్ట్ చేశామని తెలిపారు.

సంబరాల సంక్రాంతి



సిద్ధాంతంలో భోగి సందడి

పల్లెలు, పట్టణాలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయి. సంప్రదాయ పిండి వంటలతో ఇళ్లు ఘుమ ఘుమలాడితున్నాయి. బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలు పెడుతూ మొక్కుబడులు తీర్చుకొంటున్నారు. విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో భోగి మంటలు, కోలాటం ప్రదర్శనతో ఆనందంగా గడుపుతున్నారు. శుక్రవారం పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, యలమంచిలి మండలం ఏనుగువానిలంక హైస్కూల్, పెనుగొండలోని ప్రైవేటు స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు సంక్రాంతి సంబరాల్లో భాగంగా లంకలకోడేరులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు.

– పెనుగొండ / పాలకొల్లు సెంట్రల్ / యలమంచిలి /పాలకొల్లు అర్బన్



ఏనుగువానిలంక హైస్కూల్‌లో హరిదాసుకు భోగిపండ్లు వేస్తున్న విద్యార్థినులు



సిద్ధాంతంలో గొబ్బెళ్లు పెడుతున్న చిన్నారులు



డీఎన్నార్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



ఏనుగువానిలంక హైస్కూల్‌లో విద్యార్థినుల కోలాటం



లంకలకోడేరులో ముగ్గులు వేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు

- విష్ణు ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- ఉత్తర ద్వార దర్శనానికి నిరీక్షణ

పాలకొల్లు సెంట్రల్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం విష్ణాలయాలు, క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేకువ జాము నుంచి ఆలయాల వద్ద క్యూ కట్టారు. స్వామివార్లను భక్తిశ్రద్ధలతో పూజించారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో జనార్ధనస్వామి, అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారిని, కెనాల్ రోడ్డులో ఉన్న దాసోహంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామిని, యడ్లబజారు సెంటర్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు చేశారు. చినబజారులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆయా ఆలయాల వద్ద దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

నరసాపురం పట్టణంలో..

నరసాపురం: స్థానిక ఆదికేశ ఎంబేరుమానార్ దేవస్థానం (కోవెల) తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. ప్రకాశం రోడ్డులోని రామాలయం, పాతబజార్‌లోని వరాల వెంకటేశ్వరస్వామి, స్టీమర్‌రోడ్డులో ఉన్న వేణుగోపాలస్వామి, శివాలయం సెంటర్ సమీపంలోని మదనగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నరసాపురం రూరల్: వేములదీవి పడమర పంచాయతీ కాపుల కొడపలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మల్లవరం వెంకటేశ్వరస్వామి, వేములదీవి ఆదివారం మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, పసలదీవి, లక్ష్మణేశ్వరం చాగంటివారి మెరక, పసలదీవి రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్థానిక వెంకటేశ్వర స్వామి, రాజగోపాల స్వామి, కొత్తోటలోని బాల వెంకటేశ్వర స్వామి, పేరుపాలెం బీచ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయాలు వేకువ జాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని అన్ని ఆలయాల్లోను భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి

పెనుగొండ: రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కొఠాలపర్రులోని కేశవ స్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గరుధ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆచంట, పెనుగొండ మండలాల్లో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగొండ లింగాల వీధి జనార్ధన స్వామి, చెరుకువాడ వెంకటేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి, రామాలయాల్లో భక్తులు సందడి నెలకొంది. వడలిలో కమ్మవారి భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. ఆచంట కాపుల పాలెం వద్ద సీతారామంజనేయ స్వామి, వల్లూరు తోటలోని ఆంజనేయుని ఆలయం వద్ద పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పెనుమంట్ర మండలంలో..

పెనుమంట్ర: మార్టేరు దేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ఉత్తర ద్వార దర్శనం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను శేషవాహనంపై ఉంచి కోలాట భజనతో గ్రామోత్సవం నిర్వహించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ఆంజనేయస్వామి ఆలయాలు, అబ్బిరాజుపాలెం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. యలమంచిలి, మేడపాడు గ్రామాల్లోని మంచినీటి చెరువు గట్టున ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు, కొంతేరు కుంతీ లక్ష్మీ నరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ఏకాహ తాళాల భజనలు ఏర్పాటుచేశారు.



పాలకొల్లు చిన్నబజారు వేంకటేశ్వరస్వామి



నరసాపురం ఎంబేరుమానార్ స్వామి



వేములదీవిలో వెంకటేశ్వర స్వామి



యలమంచిలి మంచినీటి చెరువు గట్టు ఆంజనేయస్వామి



మొగల్తూరు రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం



కొఠాలపర్రులో కేశవ స్వామి గ్రామోత్సవం



మార్టేరులో శేషవాహనంపై శ్రీవారి గ్రామోత్సవం

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మొగల్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మొగల్తూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, గుండాట, పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కాళీపట్నం, జగన్నాథపురం, కొత్తోట, మొగల్తూరుల్లో అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. పండుగ రోజుల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ వద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు, మొగల్తూరు సర్పంచ్ పడవల సత్యనారాయణ పోలీస్, ఎక్సైజ్ శాఖ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జూద క్రీడలు చూడడమూ నేరమే

యలమంచిలి: సంక్రాంతి పేరుతో జూద క్రీడలు ఆడడమే కాదు.. చూడడం కూడా నేరమేనని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ హెచ్చరించారు. ఇలపకుర్రు, కట్టుపాలెం, శిరగాలపల్లి, మట్లపాలెం గ్రామాల్లో శుక్రవారం సంక్రాంతికి జూద క్రీడల వైపుకు వెళ్లవద్దని హెచ్చరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కోడి ఓదాలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్, గ్రామ కార్యదర్శి పీతల రాజశేకర్, వీఆర్వో జడ్డు వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ రుణాలివ్వాలి



గుంపర్రులో కౌలు రైతులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

యలమంచిలి: కౌలు రైతులందరికీ రుణాలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని గుంపర్రు రైతు సేవాకేంద్రం వద్ద శుక్రవారం కౌలు రైతులకు రుణాలు ఇప్పించేందుకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యలమంచిలి మండలంలో 852 కౌలు రైతులుండగా ఇంతవరకు 314 మందికి రుణాలు మంజూరు చేశారని చెప్పారు. మిగిలిన 528 మంది రైతులకు కూడా బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు ఇప్పించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఐదుగురు కౌలు రైతులను కలిపి గ్రూపులుగా గాని లేదా ఒక్కొక్కరికీ కూడా రుణం ఇప్పించాలని అన్నారు. మండలం మొత్తం మీద రుణాలు తీసుకోని 2,342 సర్వే నెంబర్లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గుంపర్రు సర్పంచ్ గారు తుంగ అమూల్య, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిల్ కుమారి, తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, ఏఓ చిందులూరి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గోకుల్ షెడ్ల నిర్మాణం

- వివిధ దశల్లో పనులు
- కోళ్లు, గొర్రెలకు షెడ్లు
- రైతు కుటుంబాలకు మేలు

పాలకొల్లు అర్బన్: రైతు కుటుంబాలకు ఉపాధి హామీ పథకంలో లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో గోకుల్ షెడ్లు నిర్మిస్తున్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు మంజూరు చేస్తుంది. చిన్న, సన్నకారు రైతులు 10 శాతం వాటా భరిస్తే మిగిలిన నిధులు పూర్తి సబ్సిడీతో షెడ్లు నిర్మిస్తున్నారు. రెండు గేదెల షెడ్డుకి రూ.1,15,000, నాలుగు గేదెల షెడ్డుకి రూ.1,85,000, ఆరు గేదెల షెడ్డుకి రూ.2,30,000 నిధులు విడుదల చేస్తున్నారు. అలాగే రూ.80 వేలతో ఆగర్తిపాలెం, కాపవరంలో కోళ్ల షెడ్లను, లంకలకోడేరులో గొర్రెల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ షెడ్ల నిర్మాణానికి ఎక్కువ శాతం నిధులు మెటీరియల్‌కి ఖర్చు అవుతోంది. అయితే రూ.15 వేలు విలువైన పని దినాలను రైతు కుటుంబానికి ప్రయోజనం చేకూర్చనున్నారు.

వివిధ స్థాయిల్లో నిర్మాణాలు

పాలకొల్లు నియోజకవర్గంలో చేపట్టిన గోకుల్ షెడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మండలాల వారీగా పాలకొల్లులో 53 షెడ్లు మంజూరుకాగా ఆరు నిర్మాణాలు పూర్తయ్యాయి. పునాదుల స్థాయిలో 20, రూఫ్ లెవెల్‌లో 25 ఉన్నాయి. పోడూరులో 47 మంజూరు కాగా ఎనిమిది నిర్మాణాలు పూర్తయ్యాయి. పునాదుల స్థాయిలో 21, రూఫల్ లెవెల్‌లో 18 ఉన్నాయి. యలమంచిలి మండలంలో 50 షెడ్లకు 11 పూర్తయ్యాయి. 21 పునాదుల స్థాయిలో ఉండగా, ఏడు ప్రారంభం కావాల్సి ఉంది. 10 షెడ్లను అధికారులు తిరస్కరించారు.

షెడ్ల పరిశీలన

పాలకొల్లు మండలం గవరపేట, ఆగర్తిపాలెం గ్రామాల్లో నిర్మించిన గోకుల్ షెడ్లను ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు ఇంజినీరింగ్ అసిస్టెంట్ రియాజ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి లోటుపాట్లను తెలుసుకున్నారు.



గవరపేటలో నిర్మించిన గోకుల్ షెడ్డు

ప్రారంభానికి సన్నాహాలు



గోకుల్ షెడ్ల నిర్మాణంతో రైతులకు ఎంతో ప్రయోజనం. పశువులు పూర్తి ఆరోగ్యంతో షెడ్లులో జీవించడానికి గాలి, వెలుతురు అన్ని సౌకర్యాలు కల్పించేలా షెడ్లను నిర్మిస్తున్నాం. పాలకొల్లు మండలంలో 53 షెడ్లు నిర్మించడానికి లబ్ధిదారులను ఎంపిక చేశాం. కోళ్లు, గొర్రెల షెడ్ల నిర్మాణానికీ లబ్ధిదారులను ఎంపిక చేశాం. కొన్ని షెడ్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం.

– ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో, పాలకొల్లు

నమస్తే పథకంపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: భూగర్భ డ్రెయినేజీలోకి ప్రవేశించడానికి సరైన అనుమతులు, పర్యవేక్షణ లేకుండా శిక్షణ లేని వారిని నియమించడం చట్టవిరుద్ధమని మునిసిపల్ కమిషనర్ బి.వి జయసారధి అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో సెప్టిక్ ట్యాంకు, భూగర్భ డ్రెయినేజీ వర్కర్లకు నమస్తే పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ ఈ రెండింటికి సంబంధించిన వర్కర్లు తప్పనిసరిగా నమస్తే పథకంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పట్టణ పరిధిలో వార్డు సచివాలయాల్లో శానిటేషన్ సెక్రటరీలు లేదా సెల్ నెంబర్ 70752 03873లో సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల ఆందోళన



కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గతంలో సమ్మెకాల ఒప్పందాలను జీఓ రూపంలో విడుదల చేసి మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందిని ఆదుకోవాలని త్రిమూర్తులు కోరారు. జీఓ 36 ప్రకారం జీతాల పెంచాలన్నారు. నాయకులు నల్లి ధమన్, చిక్కాల వాసు, కూన వెంకట్, షేక్ అమీనా పాల్గొన్నారు.